క్లుప్తంగా

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఈ నెల 30 వరకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రచార భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పి.మాణిక్యం కోరారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం ప్రచార భేరి గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించనున్నట్టు చెప్పారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రత్యేక హోదా.. విభజన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గేదల అప్పారావు, పల్లి అప్పారావు, కె.అప్పారావు, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం మల్కాపురానికి చెందిన ఎస్.మహేష్ అనేదాత లక్ష 1016 రూపాయిలు విరాళం ఇచ్చారు. సింహగిరిపై మే ఐ హెల్ప్‌యు కేంద్రంలో దేవస్థానం తరఫున దాతకు సూపరింటెండెంట్ పద్మనాభరాజు బాండ్ అందజేశారు.

ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ కావాలి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ

విశాఖ లీగల్ : ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో ప్రభుత్వ శాఖల ప్రతినిధులతో చర్చించారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు జె.మాధవి, జ్ఞానవేణి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు 98 డీఎస్సీ ఉపాధ్యాయుల కేటాయింపు

సబ్బవరం: డీఎస్సీ 1998 ద్వారా నియామకమైన ఇద్దరు ఉపాధ్యాయులను సబ్బవరం మండలానికి కేటాయించినట్లు ఎంఈవో ఎస్.అప్పలరాజు శనివారం తెలిపారు. మినిమం టైంస్కేల్ రూ.32,670 వేతనంపై పనిచేయడానికి వీరు అంగీకరించినట్టు చెప్పారు. వీరిని నక్కవానిపాలెం ఎంపీపీ, గంగవరం ఎంపీపీ పాఠశాలలకు కేటాయిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

అభాగ్యులకు ఆశ్రయం



పెందుర్తి లయోలా హోమ్‌లో అభాగ్యులను చేర్పిస్తున్న మమత

అల్లిపురం: కేజీహెచ్‌లో నలుగురు అభాగ్యులను ఎవరో తీసుకువచ్చి చేర్పించారు. వారికి వైద్యం పూర్తయినా వెళ్లలేని పరిస్థితిలో ఉండగా ఆస్పత్రి సిబ్బంది మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు విషయం తెలియజేశారు. దీంతో ఆమె శనివారం వారిని ఆస్పత్రి సూపరింటెండెంట్ సహకారంతో పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించి ఆశ్రయం కల్పించారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సూచించారు. స్థానిక మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. మండలంలో కార్యక్రమం జరుగుతున్న తీరు.. ప్రజల స్పందన ఎలా ఉందని నాయకులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు,ఎంపీటీసీ,సచివాలయ కన్వీనర్లు,గృహసారథులు కలిసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడుతో పాటు ఎంపీటీసీలు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

సబ్బవరం: మండలంలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఉత్సాహంగా సాగుతోంది. ఇరువాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, బలిరెడ్డి కనకరాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు ఇంటికి అతికించారు. మొబైల్ ఫోన్‌తో మిస్డ్‌కాల్ ఇచ్చి జగన్ మోహన్‌రెడ్డి సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము,గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

– మొగలిపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యల్ల నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి ఐడీబాబు,గృహసారథులు పాల్గొన్నారు.



ఇరువాడలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ముత్యాలనాయుడు, కొటాన రాము

చింతలగ్రహారంలో గడప గడపకు..

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పెందుర్తి మండలంలోని చింతలగ్రహారం గ్రామంలో ఎమ్మెల్యే శనివారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమపథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాడి అర్జున్ వరలక్ష్మి, నాయకులు కాళ్ల గంగాధర్, జగదీశ్, జోబ్‌దాస్, బొట్ట గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన



ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే, సర్పంచ్ శిరీష, అధికారులు

సింహాచలం: పెందుర్తి మండలం రాంపురం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం శనివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఎన్‌హెచ్16 అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఇక్కడ జాతీయ రహదారి మీదుగా వాహనాలు, ప్రజలు క్రాసింగ్ చేసేందుకు రూ.2.4కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళిక చేశారు. ఈమేరకు ఎక్కడ బ్రిడ్జి నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందో ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. ఇంజనీర్ వేణు, కాంట్రాక్టర్ మనోహర్, రాంపురం సర్పంచ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు



విజయగణపతికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట కృష్ణానగర్ విజయగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో శనివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, 93వవార్డు నాయకులు దాసరి సత్తిబాబు, వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

• వరలక్ష్మీనగర్ కొండపై ఉన్న షిర్డీ సాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని సాయినాథుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేముడుబాబు, మాధవరావు, సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

పరవాడ: భూసార పరీక్షల ప్రయోజనాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం నిర్వహించిన భూసార పరీక్షల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ విధానం, ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కోన రామారావు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్‌బీకే స్థాయిలో రైతులను సమన్వయ పర్చి మట్టి నమూనాలు సేకరించి పరీక్షల కోసం పంపాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పలువురి రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బందారు రాజశేఖర్, కూండ్రపు అయ్యబాబు, రైతులు గెడ్డం రామారావు, ఇందల ఈశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార ఆధారిత పంటలు లాభదాయకం

సబ్బవరం: భూసార ఆధారిత పంటలు సాగుచేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ చెప్పారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం మట్టి నమూనాల సేకరణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. మట్టి నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపించి విశ్లేషణ చేయడం వల్ల నేల ఆరోగ్యంతో పాటు పోషక విలువలు తెలుస్తాయన్నారు. దాని ద్వారా ఏ పంట సాగుచేయాలి.. ఎరువులు ఏ మోతాదులో వేయాలో రైతులకు వివరించవచ్చన్నారు. తద్వారా రైతులకు ఖర్చు తగ్గడమే కాకుండా నేల ఆరోగ్యాన్ని కూడా సంరక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు చీపురుపల్లి సత్యనారాయణ, ఏఈవో బాలరాజుతో పాటు రైతులు లెక్కల రామానాయుడు,కిల్లి దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నిహారిక

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ వద్ద తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న యువతి కోనాడ నిహారిక శుక్రవారం అర్ధరాత్రి దాటాక కనిపించలేదు. వేసవి సెలవుల నేపథ్యంలో తండ్రి నరసింహమూర్తి తన కుమార్తెను జ్ఞానాపురంలో ఉంటున్న బంధువుల ఇంటికి పంపించారు. శుక్రవారం బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లిన నిహారిక అర్ధరాత్రి 12 గంటలు అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో శనివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ బి.ఎస్.మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

హృదయాలను హత్తుకున్న నాటకాలు



కొత్త పరిమళం నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: మూడో ప్రపంచ యుద్ధ భయంతో క్షణక్షణం నరకయాతన పడుతూ బతుకీడుస్తున్న కాలంలో సరిహద్దు జీవన గాథే కథాంశంగా ప్రదర్శించిన కొత్త పరిమళం నాటకం, తల్లిదండ్రుల పేగు బంధంపై ప్రదర్శించిన మనసున మనసై నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఐదో రోజు ప్రదర్శించిన రెండు నాటకాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఈ పోటీలను కస్టమ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెస్ ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

తొలి ప్రదర్శన: 'కొత్త పరిమళం'

శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు కొత్త పరిమళం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో రగిలిన విద్వేశాలను కళ్లకు కట్టినట్టుగా చూపారు. మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోయి జాతి, మతం విద్వేషాలతో దేశాలు రగిలిపోతున్న క్షణాలు.. కన్నీళ్లు పెట్టేలా నటీనటుల ప్రతిభకు పట్టం కట్టారు. జాతి, మతద్వేషాలను అంతం చేసే మానవత్వ విశ్వరూప సౌందర్యం అనే కొత్త పరిమళంతో హద్దులు, సరిహద్దులు లేని ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన ఈ నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. కరతాళ ధ్వనులతో నటీనటులకు కృతజ్ఞతలు తెలిపారు. కె.కె.స్వామి నాటకాన్ని రచించగా.. బి.ఎం.ఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించారు.

రెండో ప్రదర్శన: 'మనసున మనసై'

ఏలూరుకు చెందిన హేళాపురి కల్చరల్ అసోసియేషన్ వారిచే మనసున మనసై నాటకం ప్రదర్శించారు. చిన్నతనంలో బడికి వెళ్లిన బిడ్డ తిరిగి ఇంటికొచ్చే వరకూ ఎదురుచూసే తల్లిదండ్రులు, పెరిగి పెద్దవాడయ్యాక సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ తలకొరివి పెట్టడానికి రోజుల తరబడి మార్చురీ బాక్స్‌లో పెట్టి ఎదురుచూసే పరిస్థితుల ఇతివృత్తంగా ప్రదర్శించిన నాటకం ప్రేక్షకుల మనసును కదిలించింది. నాటకాలు అద్భుతంగా ఉన్నాయని వారు ప్రశంసించారు.

30న 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు

డాబాగార్డెన్స్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'మే డే'సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రతినిధి జీఎస్ రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం ప్రతినిధి దండు నాగేశ్వరరావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలకు శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, ఏకపాత్రాభినయాలు, ఫ్లూట్ తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రీ, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 25 లోపల తమ ఎంట్రీలను 9490750661, 9490098794 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చని తెలిపారు.

కారు ఢీకొని లారీ క్లీనర్ మృతి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పరవాడ మండలం ఈదులపాక బోనంగి గ్రామానికి చెందిన లారీ క్లీనర్ సలాది సంజీవరావు మృతి చెందాడు. తాళ్లపాలెం హైవే బ్రిడ్జి సమీపంలో హోటల్లో భోజనం చేయడానికి సంజీవరావు రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న కారు అతనిని బలంగా ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న పోర్టు చైర్మన్ రామచంద్రన్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఐఏఎస్ అధికారి హేమలత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం విశాఖ పోర్టు చైర్మన్ టి.కె.రామచంద్రన్, ఐఏఎస్ అధికారి పి.హేమలత వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు. పోర్టు చైర్మన్ వెంట దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ఉన్నారు.

అప్రమత్తతో అగ్నిప్రమాదాల నివారణ



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మాక్ డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించవచ్చని సబ్బవరం అగ్నిమాపక కేంద్రం అధికారి దిలీప్ కుమార్ తెలిపారు.అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు చేపట్టారు. ముందుగా అగ్నిమాపక కేంద్రం నుండి మూడు రోడ్ల కూడలి వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగించే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ కె అప్పలనాయుడు, డ్రైవర్ పి .అప్పారావు,ఫైర్‌మెన్ ఏఆర్‌కే శేఖర్ బాబు,టి. వెంకటరావు,కె. మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే స్వామికి జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు తులసి మాలలు సమర్పించుకున్నారు. ఆలయ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో విశేష అర్చనలు, సహస్ర నామాభిషేకాలు నిర్వహించారు.

1న వార్షిక తిరు కల్యాణోత్సవం..

వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీన కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఏవో జీవీ రమాబాయి తెలిపారు. 1వ తేదీన ధ్వజారోహణం, ఏకాదశిని పురస్కరించుకుని సాయంత్రం 7 గంటల నుండి దేవస్థానం కల్యాణ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు వివరించారు. 5వ తేదీన చక్రతీర్థం, ధ్వజావరోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్రహారతి, సప్తహారతి కార్యక్రమాలు, 6వ తేదీన ఊంజల సేవ, పుష్పాలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎస్పీ కోదండపాణి సంగీతం చిరస్మరణీయం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ రామచంద్రన్


డాబాగార్డెన్స్: తెలుగు చలనచిత్రసీమలో ఎస్పీ కోదండపాణి సంగీతం చిరస్మరణీయమని విశాఖ పోర్టు చైర్మన్ టీకే రామచంద్రన్ పేర్కొన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి 49వ వర్ధంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం కళాంజలి సినీ సంగీత సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కె. రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మనసా కవ్వించకే నన్నిలా పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరిని పోర్టు చైర్మన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నలభై రెండేళ్ల వయస్సులో కన్నుమూసిన కోదండపాణి అతి తక్కువ కాలంలో 101 చిత్రాలకు చక్కని బాణీలు కట్టారని చెప్పారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పాటకు, సాహిత్యానికి గౌరవం పెంచేలా సంగీతాన్ని అందించిన మహనీయుడు కోదండపాణి అని కొనియాడారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ రాంజీ, మాజీ ఏడీసీపీ మహ్మద్‌ఖాన్, బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, కళా సంఘాల కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గంటి మురళీ తదితరులు పాల్గొన్నారు. రాజేంద్ర ప్రసాద్, శ్రీలత, కూర్మనాథం, శైలజ, కేఎస్ ప్రకాష్, పద్మజ, రమేష్ పట్నాయక్, శ్రీలత, ఫణిభూషణ్, శ్రీలత, జోగారావు తదితరులు తమ గీతాలాపనతో అలరించారు.

ఎస్టీ సెల్ ప్రక్షాళన హర్షణీయం

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఎస్టీ సెల్‌ను ప్రక్షాళన చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయమై సాక్షి దిన పత్రికలో ఈనెల 12న 'కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన'శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి విదితమే. అవినీతి, నిర్లక్ష్యం వంటి ఆరోపణలు వెల్లువెత్తిన ఈ విభాగం గిరిజనులకు సరైన సేవలందించలేకపోయిందని అన్నారు. ఈ తరుణంలో ఇక్కడి సిబ్బందిని బదిలీ చేసి కొత్త వారిని నియమించడం మంచి పరిణామమన్నారు. బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు అమలు చేసిన ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ సుమిత్, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఐటీడీఏ పీవో, వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌కు కమిషన్ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సీతారాం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో 'విషు' పండగ

• విశేష అలంకరణలో అయ్యప్ప



అయ్యప్ప స్వామికి నివేదించిన నవధాన్యాలు, కూరగాయలు

అక్కిరెడ్డిపాలెం: కేరళీయుగ ఉగాది 'విషు' సందర్భంగా అయ్యప్పస్వామి విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని కేరళీయులు నవధాన్యాలు, కూరగాయలను స్వామికి నివేదించారు. ముందుగా స్వామిని పంచామృతాలతో, గంధంతో అభిషేకించి, పట్టువస్త్రాల తో, పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేకువజామున 4గంటల నుంచి 6గంటల మధ్య స్వామి దర్శనం కల్పించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, కార్యదర్శి శేషగిరిరావు తెలిపారు. మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ప్రైవేటీకరణ ఆగే వరకు ఉద్యమం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగే వరకు కార్మికుల ఉద్యమాలు ఆగవని పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే దీక్షల్లో 793వ రోజు శనివారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు.